మావోయిస్టుల బంద్ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

భారత్ బంద్ కు శుక్రవారం మావోయిస్టులు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఎల్విన్ పేట పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ నేపథ్యంలో సిఐ హరి ఎల్విన్‌పేట, గుణుపూర్, కూడలి వద్ద గురువారం రాత్రి ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఆంధ్రా నుంచి ఒడిస్సా, శ్రీకాకుళం, భువనేశ్వర్ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. కొత్త వ్యక్తుల వివరాలు తెలుసుకొని విడిచిపెట్టారు. మావోయిస్టు బంద్ నేపథ్యంలో ఎల్విన్‌పేట, కురుపాం, నీలకంఠాపురం పోలీస్ స్టేషన్లలో భద్రత కట్టుదిట్టం చేశారు. రాత్రివేళ గ్రామాల్లో పహారా కాస్తున్నారు.

విద్యార్థుల మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి

- మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలి
- లేకుంటే మంత్రి ఇంటిని ముట్టడిస్తాం
- ఎస్ఎఫ్ఐ జీపు జాతాలో రాష్ట్ర అధ్యక్షులు పి. రామ్మోహన్

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అఖిల్

ప్రజాశక్తి - పాచిపెంట/సాలూరు

ఏజెన్సీలోని గురుకుల పాఠశాలల్లో అనారోగ్యంతో మృతి చెందిన విద్యార్థుల మరణాలకు ప్రభుత్వం బాధ్యత వహించి మృతుల కుటుంబాలకు రూ.50లక్షలు చొప్పున పరిహారం ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్ డిమాండ్ చేశారు. లేదంటే గిరిజన సంక్షేమశాఖా మంత్రి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలని, మరణాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన గురువారం పాచిపెంట, సాలూరులో జీపు జాతా సాగింది. తొలుత పాచిపెంట ప్రభుత్వ జూనియర్ కాలేజీ వద్ద ఎస్ఎఫ్ఐ మన్యం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.అనిల్, పి అఖిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జీపుజాతాను రామ్మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వల్ల పాఠశాలలో మౌలిక సదుపాయాల్లేక, పౌష్టికాహారం అందక గిరిజన విద్యార్థులు మరణిస్తున్నారని అన్నారు. పద్మాపురం ఆశ్రమ పాఠశాల బాలుర వసతి గృహాన్ని పరిశీలిస్తే ఇరుకు గదులతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వంటగది కూడా సరిగ్గా లేదన్నారు. తక్షణమే భవన నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు రావాలన్నారు. పాచిపెంట జూనియర్ కళాశాలకు హాస్టల్ సౌకర్యం కల్పిస్తే విద్యార్థుల డ్రాపౌట్స్ తగ్గుతుందన్నారు. నిత్యావసర సరుకులు, గ్యాస్ ధరలు పెరిగి ఇబ్బందులు పడుతున్న తరుణంలో విద్యార్థులకు పౌష్టికాహారం అమలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పౌష్టికాహార లోపంతో అనేకమంది రక్తహీనతతో బాధపడుతున్న పరిస్థితి ఉందని ప్రభుత్వం ఒక పక్క చెబుతూనే మరోవైపు పూర్తిస్థాయి లో పౌష్టికాహారం అందించకపోవడం దారుణమన్నారు. ప్రతి వారానికి రెండుసార్లు హెల్త్ చెకప్ చేయాలని, అన్ని ఆశ్రమ పాఠశాలలకు ఎఎన్ఎంలను నియమించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ అనారోగ్యంతో మరణించిన 11మంది విద్యార్థుల కుటుంబాలకు పరిహారం అందించాలని, ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల పట్ల నిర్లక్ష్యధోరణి మానుకొని భవిష్యత్తులో గిరిజన విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని డిమాండ్‌చేశారు. ఎస్ఎఫ్ఐ నిర్వహించే పోరాటాల్లో విద్యార్థులే కాకుండా ప్రజలు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి డి.పండు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే ఎఎన్ఎంలను నియమించాలని, గిరిజన ప్రాంతాల్లో విద్యార్థుల పట్ల పాలకులు నిర్లక్ష్య ధోరణి మానుకోవాలన్నారు. జాతాకు మద్దతు తెలిపిన సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు హెల్త్ చెకప్‌లు నిరంతరం ఉండాలని, సురక్షితమైన మంచినీరు అందించాలని, మరుగుదొడ్లు పదిమందికి ఒకటి చొప్పున ఉండాలని కోరారు. కలుషిత నీరు వల్ల విద్యార్థులు పచ్చకామెర్లు బారినపడుతున్నారని, దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా విద్యార్థులకు రక్షణ కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శరత్, శ్రావణి, మహిళా కన్వీనర్ ఇందు, దివ్య, శరత్, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు జె.రామయ్య, జోగారావు తదితరులు పాల్గొన్నారు.

డోలీ మోతల్లేని గ్రామాలే లక్ష్యం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో డోలీ మోతల్లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే తక్షణ కర్తవ్యమని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి ఎంపిడిఒలను ఉద్బోధించారు. మండల పరిధిలోని డోలీ గ్రామాలను గుర్తించి, అవసరమైన మేర రోడ్లకు సర్వే చేసి మంజూరు అనుమతులు పొందాలని అన్నారు. ఈ ప్రక్రియంతా రానున్న నెల రోజుల్లోగా పూర్తి కావాలని స్పష్టం చేశారు. ఇందుకు పంచాయతీ రాజ్, గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకొని, రోడ్డు శంకుస్థాపన దగ్గర నుంచి ప్రారంభించే వరకు ఎంపిడిఒలే పూర్తి బాధ్యత వహించాలని కలెక్టర్ తేల్చిచెప్పారు. గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, ఎంపిడిఒలు, ఇంజినీరింగ్ అధికారులతో పలు శాఖలకు చెందిన అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత సీజనులో జ్వరాలు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, అటువంటి కేసులు ఉన్న ఆసుపత్రులను ఎంపిడిఒలు ప్రతి రోజూ సందర్శించి వైద్యులు, సిబ్బందిని పర్యవేక్షించాలని అన్నారు. వారంలో అన్ని ఆసుపత్రులను సందర్శించాలని, సందర్శించిన టూర్ డైరీని తమకు సమర్పించాలని పేర్కొన్నారు. మండల పరిధిలోని చారిత్రక, పర్యాటక, సుందరమైన ప్రాంతాలను గుర్తించి ఆదికర్మయోగిలో భాగంగా స్థానిక గిరిజనులతో అభివృద్ధి చేస్తూ, వారికి ఉపాధి కల్పించే బాధ్యతను తీసుకోవాలన్నారు. జిల్లాలో 2,308 వరకు చెరువులు ఉన్నాయని, వాటిని చేపల పెంపకానికి వినియోగించేలా తీర్చిదిద్దాలని అన్నారు.

శ్మశాన వాటికల్లో సర్వే చేయించి ఆక్రమణలు లేకుండా చూడాలన్నారు. జిల్లాలో గ్రౌండ్ వాటర్ స్థాయి మూడు మీటర్ల కంటే ఎక్కువ లోతుగా ఉంటే అటువంటి ప్రదేశాల్లో చెక్ డ్యామ్స్, సోక్ పిట్స్ వంటి వాటిని ఏర్పాటుచేసి నీటి నిల్వల స్థాయిని పెంచాలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి ఎంపిడిఒ మండల పరిధిలోని పంచాయతీల్లో పారిశుధ్య కార్యక్రమాలు బాగా జరగాలని, ఇందుకు స్థానిక సర్పంచులను బాధ్యులను చేయాలని, ప్రతి నెలా సర్పంచులతో సమావేశం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సంతలను కొత్త తరహాలో రూపొందించాలని, ఆ దిశగా ఆలోచన చేసి చర్యలు చేపట్టాలని అన్నారు. ఉల్లాస్ కార్యక్రమం ద్వారా జిల్లాలో 1,00,410 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం లక్ష్యమని, ఆ దిశగా ఎంపీడీఓలు చర్యలు తీసుకోవాలని అన్నారు. మలేరియా ప్రభావిత గ్రామాలను ఎంపిడిఒలు ప్రతి రోజూ కచ్చితంగా సందర్శించి, నివారణా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి హేబిటేషనులో ఐదు పీఎం సూర్యఘర్ యూనిట్లు స్థాపన కావాలని, తద్వారా యజమానులకు ఆదాయం వస్తుందనే విషయాన్ని వివరించాలని అన్నారు. పీజీఆర్ఎస్ దరఖాస్తులు ఎటువంటి పరిస్థితిల్లో రీ ఓపెన్ కారాదని, ఎంపీడీఓలే స్వయంగా దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని తెలిపారు. ఇ - పంట నమోదు ప్రక్రియ ఈ నెల 25 నాటికి శత శాతం పూర్తికావాలని ఆదేశించారు. ఇ - పంట నమోదులో వెనుకబడిన పార్వతీపురం, కొమరాడ, పాలకొండ మండలాలు మరింత దృష్టి సారించి శత శాతం పూర్తి చేయాలని అన్నారు. ధాన్యం సేకరణ త్వరలో ప్రారంభం కానుందని, కావున ఈ కార్యక్రమం సజావుగా జరిగేలా ప్రత్యేక దష్టి సారించాలని అన్నారు. సమావేశంలో ఎస్డీసిలు పి.ధర్మచంద్రారెడ్డి, ఎస్.దిలీప్ చక్రవర్తి, డ్వామా, డిఆర్‌డిఎ పీడీలు కె.రామచంద్రరావు, ఎం.సుధారాణి, సిపిఒ ఎస్ఎస్ఆర్ పట్నాయక్, జిల్లా వ్యవసాయ, ఉద్యానవన అధికారులు కె.రాబర్ట్‌పాల్, వై.క్రాంతికుమార్, డిఎంహెచ్ఒ డా.ఎస్.భాస్కరరావు, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఇ కె.మల్లికార్జున, డిపిఒ టి.కొండల రావు, వయోజన విద్య ఏడీ కె.వైకుంఠరావు, పలువురు అధికారులు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలి : కలెక్టర్

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

గిరిజన విద్యాభివృద్ధికి మరో ముందడుగు : మంత్రి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని సరాయివలసలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు రూ.4.76 కోట్ల వ్యయంతో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ శంకుస్థాపనతో గిరిజన విద్యా అభివృద్ధిలో మరో ముందడుగు వేశామన్నారు. గిరిజన పిల్లల విద్యా ప్రగతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆధునిక సదుపాయాలతో పాఠశాలలు నిర్మించడం ద్వారా విద్యార్థులు మంచి వాతావరణంలో విద్యను అభ్యసించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పాఠశాల భవనం పూర్తయిన తర్వాత విద్యార్థులు మరింత సౌకర్యవంతమైన వసతులు, పాఠశాల వాతావరణాన్ని పొందుతారని ఆమె తెలిపారు. అంతకుముందు విద్యార్థులతో మంత్రి ముచ్చటిస్తూ పాఠశాలలో అందిస్తున్న విద్యా ప్రమాణాలు, పౌష్టికాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల సంక్షేమానికి, మౌలిక సదుపాయాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న నిరంతర ప్రయత్నాలను మంత్రికి వివరించారు. ప్రభుత్వం ద్వారా మరింత బలమైన, స్మార్ట్, సుస్థిర గ్రామాలను నిర్మించడానికి ఇది ఒక పెద్ద ముందడుగని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామప్రజలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కల్తీ మద్యం పాపం జగన్‌దే : మంత్రి

ప్రజాశక్తి - సాలూరు

కూటమి ప్రభుత్వం ప్రతిష్టకు భంగం కలిగించేలా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైసిపి నకిలీ మద్యం కుట్రలు పన్నుతోందని రాష్ట్ర గిరిజన, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆరోపించారు. గత ఐదేళ్ల పాలనలో కల్తీ మద్యం ఏరులై పారిందని, జగనే దీనికి 'పాపాత్ముడు' అంటూ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ తాడేపల్లి ప్యాలెస్ కేంద్రంగా కల్తీ మద్యం తయారీకి వైసిపి ప్రణాళికలు రచిస్తోందని విమర్శించారు. జగన్ హయాంలో జె బ్రాండ్ పేరుతో కల్తీ మద్యాన్ని ప్రభుత్వ ముద్ర వేసి విక్రయించారని, దీనివల్ల వేలాది మంది ప్రాణాలు కోల్పోగా, లక్షలాది మంది అనారోగ్యానికి గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ పాలనలో ప్రభుత్వ బ్రాండెడ్ మద్యం అమ్మకాలు నిలిపివేసి, కల్తీ మద్యాన్ని అధిక ధరలకు అమ్మి రూ.3,500 కోట్లు దోచుకున్నారని మంత్రి ఆరోపించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కల్తీ మద్యం తయారీ, అమ్మకాలపై ఉక్కుపాదం మోపుతోందని మంత్రి సంధ్యారాణి తెలిపారు. జగన్ హయాంలో విచ్చలవిడిగా ఉన్న మూడు లక్షలకు పైగా బెల్ట్ షాపులను పూర్తిగా మూసివేయించామని, బెల్ట్ షాపు నిర్వహిస్తే రూ.5 లక్షల జరిమానా విధిస్తున్నామని చెప్పారు. మొలకల చెరువు ఘటనపై ఇప్పటికే ఐదుగురు ఐపిఎస్ అధికారులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేశామని, త్వరలోనే వాస్తవాలను ప్రజల ముందుంచుతామని మంత్రి వెల్లడించారు. కల్తీని అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక "సురక్షా యాప్" రూపొందిస్తోందని, విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కర్నూలు, చిత్తూరులో నూతన మద్యం పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

విద్యార్థులకు జ్వరమొస్తే మంత్రికి బాధ్యత లేదా?

పదవికి రాజీనామా చేసి పార్టీకి సేవ చేసుకో
సంధ్యారాణిపై మండిపడ్డ మాజీ డిప్యూటీ సిఎం పుష్ప శ్రీవాణి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన విద్యార్థులకు అనారోగ్యం వాటిల్లితే నాదా బాధ్యత అంటూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి చేసిన వ్యాఖ్యలపై మాజీ డిప్యూటీ సిఎం పాముల పుష్ప శ్రీవాణి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. జియ్యమ్మవలస మండలం చినమేరంగిలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో పుష్పశ్రీవాణి మాట్లాడారు. గిరిజన గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో సమస్యలు, విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు ఎదురైతే మీకు బాధ్యత లేదా మరి ఎవరిది బాధ్యత మీరే చెప్పండి ప్రభుత్వానికి కాదా అంటూ ప్రశ్నించారు. మీ నిర్లక్ష్యం మీ ప్రభుత్వ నిర్లక్ష్యం విద్యార్థులకు సురక్షితమైన నీరు అందించక పోవడం వల్ల కలుషిత నీరు తాగి ఇద్దరు విద్యార్థులు చనిపోవడం, సుమారు 200 మంది విద్యార్థులు పచ్చకామెర్లతో ఆసుపత్రిలో చేరితే నాకేంటి బాధ్యత అని మాట్లాడతారా అని ప్రశ్నించారు. కనీసం మృతిచెందిన విద్యార్థుల కుటుంబా లకు ఎక్స్ గ్రేషియో తీసుకువచ్చే బాధ్యత లేనప్పుడు పదవి ఎందుకన్నారు. మంత్రి అంటే పార్ట్ ఆఫ్ ది గవర్నమెంట్ అని గుర్తు చేశారు. ఒక గిరిజన మంత్రి అయి ఉండి ప్రతి మాటలో, ప్రతి వ్యాఖ్యలో అధికార మదం, అహంకారం, అసమర్థత అంతకంటే ఎక్కువ కనిపిస్తుందన్నారు. మంత్రి కచ్చితంగా గిరిజన సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి పదవికి రాజీనామా చేసి పార్టీకి సేవ చేసుకోవాలని సూచించారు. కురుపాం గురుకులం విద్యార్థుల సమస్య వచ్చిన నాటి నుంచి పై నుంచి వచ్చిన స్క్రిప్ట్‌తో కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి, సాలూరు ఎమ్మెల్యే, మంత్రి సంధ్యారాణి ఒకే టాపిక్ మాట్లాడుతున్నారని విమర్శించారు. 750 ఆశ్రమ పాఠశాలలకు ఎఎన్ఎంలను నియమిస్తామని మంత్రి చెబుతున్నారని, ఉన్నవి 371 మాత్రమే అని ఎటువంటి సబ్జెక్టూ లేకుండా పెద్ద జ్ఞాని లాగా మాట్లాడారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 11 మంది విద్యార్థులు చనిపోయారో లేదో ఐటిడిఎలో డిడిని అడిగితే ఇస్తారని అన్నారు. అధికారంలో ఉన్న ప్రతిపక్షం లో ఉన్న మేమే నష్ట పరిహారం ఇవ్వాలా అని ప్రశ్నించారు. 2019లో కురుపాంకు గురుకుల పాఠశాలను తీసుకువస్తే 2025లో జరిగిన సంఘటనకు పుష్ప శ్రీవాణియే కారణమని, పాఠశాల తీసుకురావడం వల్లనే విద్యార్థులు పచ్చకామెర్ల బారిన పడ్డారని స్థానిక ఎమ్మెల్యే మాట్లాడడం విచారకరం అన్నారు. ఈ సమావేశంలో కురుపాం, జియమ్మవలస జెడ్‌పిటిసిలు సుజాత, శశికళ, ఎంపిపి శెట్టి పద్మావతి, మండల కన్వీనర్ కోట రమేష్ పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాచిపెంట, సాలూరు మండలాల్లో జెసి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - పాచిపెంట/సాలూరు

పాచిపెంట, సాలూరు మండలాల్లో జరుగుతున్న పలు కార్యక్రమాల్లో జాయింట్ కలెక్టర్, ఇంచార్జి ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి గురువారం పాల్గొని, ఆకస్మిక తనిఖీ చేశారు. పాచిపెంట మండలం సరాయివలస, కొటికిపెంటల్లోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లను జెసి తనిఖీ చేశారు. ఈ తనిఖీలో పాఠశాల ప్రాంగణంలోని పారిశుధ్యం, తాగునీరు, మరుగుదొడ్లు, వంటగది, భోజన ఏర్పాట్లను పరిశీలించిన ఆయన ఈ ప్రాంతాలన్నీ ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉండాలన్నారు. అక్కడి విద్యార్థులతో ముచ్చటించిన ఆయన వారి విద్యా ప్రమాణాలను సమీక్షించారు. అలాగే నిర్మాణ దశలో ఉన్న ఇఎంఎస్ఆర్ పనులను తనిఖీ చేశారు. అక్కడి నుంచి తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రెవెన్యూ రికార్డులు, పీజీఆర్ఎస్ దరఖాస్తులను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. స్థానిక రెవెన్యూ సమస్యలను సమీక్షించిన జేసీ త్వరగా పరిష్కారం చేసేందుకు పలు మార్గదర్శకాలను జారీ చేశారు. సాలూరు మండలం కూర్మరాజుపేటలోని పిహెచ్‌సి నిర్మాణాన్ని తనిఖీ చేసి, ఎం-బుక్ ప్రకారం నాణ్యత, కొలతలను తనిఖీ చేసి ధృవీకరించారు. అదే గ్రామంలో రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి ఇ-పంట రికార్డులు, సంబంధిత ఆన్‌లైన్ రికార్డులపై సమీక్షించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులు, స్టాక్ రిజిస్టర్లు, ఆహార సరఫరా నాణ్యత, పరిమాణాన్ని తనిఖీ చేశారు. ఐటిడిఎ పరిధిలోని అన్ని సంక్షేమ, అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకత ఉండాలని అన్నారు. సకాలంలో పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సాలూరు : కూర్మరాజుపేటలో నిర్మాణంలో ఉన్న పిహెచ్‌సిని పరిశీలిస్తున్న జెసి యశ్వంత్‌కుమార్‌రెడ్డి

ప్రజలకు వైద్య సేవలందించాలి : సిఐటియు

ప్రజాశక్తి - పాలకొండ

ప్రభుత్వ ఆరోగ్యశ్రీ సేవలు గత నెల రోజులుగా నిలిపివేయడంతో అనారోగ్యంతో ఉన్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసమంటూ గొప్పలు చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం ప్రజలకు వైద్య సేవలు ఎందుకు నిలిపివేసిందని ప్రశ్నించారు. సెప్టెంబర్ 24 నుంచి ఒపి ఆరోగ్యశ్రీ వైద్య సేవలు బంద్ అవ్వడంతో జిల్లాలో సూపర్ స్పెషాలిటీ వైద్యమందక ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అక్టోబర్ 10 నుంచి ఆరోగ్యశ్రీ అన్ని ఎమర్జెన్సీ సేవలు బంద్ చేయడంతో కార్డియాలజీ, న్యూరాలజీ, బ్రెయిన్ స్ట్రోక్ ప్రమాదాలు జరిగినప్పుడు జిల్లాలో ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లేకపోవడంతో పేదలు పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లించి వైద్యం చేయించుకోలేక, విశాఖ కెజిహెచ్‌కు తరలించేలోపే ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమర్జెన్సీ వైద్యం కోసం ఇచ్ఛాపురం నుంచి విశాఖపట్నం వెళ్లాలంటే 250 కిలోమీటర్లు ప్రయాణించాలని, అనారోగ్యంతో ఉన్న వ్యక్తి పరిస్థితి ఏమవుతుందని ప్రశ్నించారు. ఆరోగ్యశ్రీ సేవలు ద్వారా 3,200 జబ్బులకు రాష్ట్రంలో రోజుకు సుమారు 9000 ప్రీ ఆథరైజేషన్ ఉండేవని, జిల్లాలో ఇప్పుడు ఆరోగ్యశ్రీ సేవలందకపోవడంతో పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్యమందక తీవ్రమైన కష్టాలు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆరోగ్యశ్రీ సేవలు ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

చెస్ పోటీలను విజయవంతం చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో నవంబర్ 13 నుంచి 15 వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు బాగుండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి స్పష్టం చేశారు. గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో 800 మీటర్ల అథ్లెటిక్స్‌లోనూ, ఇండో నేపాల్ 800 మీటర్ల అథ్లెటిక్స్‌లో ప్రథమ బహుమతి పొందిన క్రీడాకారులను కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలకు అన్ని విధాలా సహకరిస్తామన్నారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో జరిగే అన్ని క్రీడాంశాల్లో మన జిల్లావాసులే ఉండాలని, అందుకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. పీఈటీలు, పీడీలు కూడా ప్రతి రోజూ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి శిక్షణ ఇస్తే పతకాలు సాధిస్తారని అన్నారు. రాష్ట్ర స్థాయిలో చెస్ పోటీలు జరగబోతున్నాయని, 486 మంది ఆటగాళ్లు ఇందులో పాల్గొంటున్నట్లు చెప్పారు. పోటీలకు హాజరయ్యే రాష్ట్రస్థాయి ఆటగాళ్లను గౌరవంగా చూసుకోవాలని, వారికి అత్యుత్తమ ప్రమాణాలతో సౌకర్యాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమం విజయవంతానికి అధికారులంతా కృషి చేయాలన్నారు. సమావేశంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

40 మందికి కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఏరియా ఆసుపత్రిలో జెమ్స్ వైద్యులతో నిర్వహించిన కన్సర్ స్క్రీనింగ్ ఉచిత పరీక్షలకు 40 మంది రోగులు హాజరయ్యారు. వీరికి ఉచితంగా కేన్సర్ పరీక్షలను నిర్వహించారు. వీరిలో నలుగురిని జెమ్స్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో ఐటిడిఎ డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయపార్వతి, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు, జెమ్స్ వైద్యులు డాక్టర్ మానస, డాక్టర్ తమయ, డాక్టర్ కీర్తన, డాక్టర్ జాన్వి, డాక్టర్ రేష్మ, డాక్టర్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

జల వనరులను పరిరక్షించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని జల వనరులు, చెరువులు ఆక్రమణ కాకుండా పరిరక్షించాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో చెరువులు, జలవనరులపై జెసి సమీక్షించారు. ఈ సందర్భంగా గత సమావేశాల్లో తీసుకున్న చర్యల నివేదికలను జెసి అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని నీటి కుంటలు, ట్యాంక్ బెడ్‌లను గుర్తించాలని, వాటికి సంబంధించిన సర్వే, సరిహద్దులను స్థిరీకరించాలని అన్నారు. గుర్తించిన ఆక్రమణలపై తీసుకున్న చర్యలు గురించి జెసిని అడిగి తెలుసుకున్నారు. ఆక్రమణలను నివారించడానికి, తొలగించడానికి అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఒ కె.హేమలత, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, పార్వతీపురం మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసరాజు, బూడా బొబ్బిలి అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి, సుడాశ్రీకాకుళం ప్లానింగ్ అధికారి, పార్వతీపురం ఇరిగేషన్ ఇఇ, జిల్లా గ్రామ పంచాయతీ శాఖ ఎఒ, పార్వతీపురం పట్టణ ప్రణాళిక అధికారి, జిల్లా పబ్లిక్ హెల్త్ ఇంజనీర్ అధికారి, సాలూరు, పాలకొండ మున్సిపల్ కమిషనర్లు, ఆశాజ్యోతి ఆశ్రమం తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి ధాన్యం కొనుగోలు

సివిల్ సప్లై డిఎం శ్రీనివాసరావు

ప్రజాశక్తి -పార్వతీపురం

జిల్లాలో నవంబర్ 10నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించనున్నట్లు సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ కె.శ్రీనివాసరావు చెప్పారు. గురువారం ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 281 రైతు సేవా కేంద్రాల పరిధిలో 180 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేపడతామని చెప్పారు. 93 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, 61 రైతు ఉత్పత్తి సంఘాలు, 20 జిసిసి కేంద్రాలు, ఐదు స్వయం సహాయక సంఘాల ద్వారా కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. 2.5 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. అంతకన్నా ఎక్కువ ఉన్నా కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో హెల్పర్, టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించినట్లు తెలిపారు. వీరితో పాటు గ్రామ వ్యవసాయ సహాయకులు, రైస్ మిల్లుల వద్ద పనిచేసే కస్టోడియన్ అధికారులు, మోనటరింగ్ అధికారులకు మండల, డివిజన్, జిల్లా స్థాయిలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. శనివారం నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాల గురించి రైతులకు అవగాహన కల్పించనున్నామన్నారు. 17శాతంలోపు ధాన్యంలో తేమ వుండేలా రైతులు చూసుకోవాలని కోరారు. జిల్లాలో 107 రైస్ మిల్లులకు ధాన్యం సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు మిల్లర్లు బ్యాంక్ గ్యారంటీ చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. రైతులు వారికి నచ్చిన మిల్లుకు ధాన్యం రవాణా చేసుకోవచ్చునన్నారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులు దళారీలను ఆశ్రయించవద్దని డిఎం శ్రీనివాసరావు కోరారు.

పాఠశాల తెరిచి వారమైనా చేరని విద్యార్థులు

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతూ పచ్చకామర్లు వ్యాధి బారిన పడి అంజలి, కల్పన అనే ఇద్దరు విద్యార్థులు మృతి చెందగా, సుమారు 200 మంది విద్యార్థులు వ్యాధి బారిన పడి ఆస్పత్రిలో చికిత్స పొందిన నేపథ్యంలో కలెక్టర్ పాఠశాలకు వారం రోజులు సెలవులు ఇచ్చారు. తిరిగి ఈనెల 15న ప్రారంభించి నేటికి వారం రోజులైనా 609 విద్యార్థులకు కేవలం 15 మంది మాత్రమే నేటికి చేరారు. ఈ సందర్భంగా విద్యార్థులు తల్లిదండ్రులు మాట్లాడుతూ పాఠశాల ఉపాధ్యాయులు మా వద్దకు వచ్చి విద్యార్థులను పాఠశాలకు పంపించమని అడుగుతున్నప్పటికీ తాము పంపించమని చెబుతున్నారు. తమ పిల్లలు ప్రాణాలకు భరోసా కల్పించే వారే కరువయ్యారని, కావున అధికారులు, ప్రజాప్రతినిధులు తల్లితండ్రులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మా పిల్లలు ప్రాణాలకు భరోసా కల్పిస్తేనే పంపిస్తామని లేనిచో పంపించమని అంటున్నారు.

వ్యాసరచన పోటీలు

పార్వతీపురం టౌన్ : పోలీసు అమరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లాలోని పలు పోలీసు స్టేషన్ పరిధిలో గల పాఠశాల విద్యార్థులకు, ఆయా పరిధి పోలీస్ అధికారులు, సిబ్బంది "లైంగిక నేరాల నుండి మహిళలు, పిల్లల రక్షణలో విద్యార్థుల పాత్ర" అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేయనున్నారు. అలాగే పోలీస్ సంబంధిత లఘుచిత్రాలను ప్రదర్శించి పోలీసులు సమాజ రక్షణలో ఎంత కీలకమో ప్రతి పౌరుడు సమాజ రక్షణలో ఏ విధమైన భాగస్వామ్యాన్ని కలిగి ఉండాలో విద్యార్థులకు వివరించారు.

కురుపాం : పోలీసుల విధులు, చట్టాలపై విద్యార్థులకు తప్పనిసరిగా అవగాహన ఉండాలని నీలకంఠాపురం ఎస్సై నీలకంఠరావు సూచించారు. పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా గురువారం నీలకంఠాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు పోలీసుల విధులు బాధ్యతలు చట్టాలపై సినిమాల క్లిప్పింగ్స్ ద్వారా చూపించారు. అనంతరం ఆయన విద్యార్థులకు పోలీసు స్టేషన్ వ్యవస్థ, కేసులు నమోదు ప్రక్రియ, నేరస్తులను పట్టుకొనే విధానం, ట్రాఫిక్ నియమాలు, గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

గ్రామస్తులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వైశాలి

గృహ దరఖాస్తుల పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురం

మండలంలోని అందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులున్న గ్రామాల్లో సబ్‌కలెక్టర్ వైశాలి గురువారం పర్యటించారు. మండలంలోని బొడ్డవలస, సంఘంవలస గ్రామాల్లో దరఖాస్తు చేసుకున్న ప్రజలతో మాట్లాడారు. వారికి ఇంటి అవసరంపై గురించి అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి గురించి ఆరా తీయాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు సబ్ కలెక్టర్ వైశాలి ఈ గ్రామాల్లో పర్యటించారు. ఆమె వెంట మండల తహశీల్దార్ సురేష్ వున్నారు.

బస్‌షెల్టర్ లేక ప్రయాణికులకు ఇబ్బందులు

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక హనుమాన్ జంక్షన్ వద్ద బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గురువారం లక్ష్మి నరసింహ దేవాలయానికి యాత్రికులు పెద్ద సంఖ్యలో వచ్చారు. వీరంతా బస్సు ప్రయాణ సౌకర్యం లేక ఇబ్బందులకు గురవుతున్నారు. దేవాలయానికి వెళ్లి వచ్చిన తరువాత బస్టాండ్ వద్ద చెట్టు వద్దనే నిలబడాల్సి వస్తుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా ఉచిత బస్సు కావడంతో మహిళలు చూసి బస్సులు ఆపడం లేదని చెబుతున్నారు. ప్రయాణికుల కోసం బస్ షెల్టర్‌ను నిర్మించాలని మహిళలు ప్రయాణాలు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని అరసాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పి.వినీత రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధాన ఉపాధ్యాయులు ఈశ్వర్ రావు, పీడీ బాలకృష్ణ తెలిపారు. ఇటీవల అండర్ 17 విభాగంలో బలిజిపేట సీతానగరం భోగాపురంలో జరిగిన మండల స్థాయి డివిజన్ స్థాయి జిల్లా స్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు అభినందించారు. కొద్ది రోజులలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలలో కూడా ప్రతిభ చూపి పాఠశాలకు గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రభుత్వ నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి రజిని సూచించారు. మండలంలోని భద్రగిరి గురుకుల బాలుర కళాశాలను ఆమె గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వంట గదిని వెళ్లి ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థులకు వండే ఆహారం తిని రుచి చూశారు. విద్యార్థులకు అందించే పౌష్టికాహారం ద్వారా రక్తహీనత లేకుండా ఆరోగ్యవంతులుగా ఉండేందుకు వీలుంటుందన్నారు. కురుస్తున్న వర్షాలతో కళాశాల ఆవరణంలో నీటి నిల్వ లేకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన విద్యా బోధన అందించి ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యుగంధర్ ఉన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - పాలకొండ

సినీ నటుడు ప్రభాస్ జన్మదినం సందర్భంగా గురువారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో కోట సంతోష్ కుమార్, మాకల కృష్ణ ఆధ్వర్యంలో రక్త దాన శిబిరం ఏర్పాటు చేయగా, పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమం లో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చిరంజీవి, ఆర్ఎంఒ రవికుమార్, బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్ శివప్రకాష్, సత్యం నాయుడు, సత్యనారాయణ, ప్రసాద్, గోవింద్, కామేష్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యకృషీవలుడు గౌరీ శంకరుడు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పంచాయతీలోని ప్రతి సమస్యను పరిశీలించి పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తూ నిత్య కృషీవలుడుగా గ్రామ సర్పంచి బొత్తాడ గౌరీ శంకర్రావు ప్రజల మన్ననలు పొందారు. గ్రామంలో పాడైన బోర్లు, వీధి కాలువలు, వీధి దీపాలు, ప్రజారోగ్యం, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలపై దృష్టి సారించి సమస్యల పరిష్కార వేదిక చూపారు. పంచాయతీకి నిధులు ఉన్నా లేకున్నా ప్రజా సంక్షేమమే పరమావధిగా భావించి సేవలు అందిస్తున్నారు.

చెరువును తలపిస్తున్న పాఠశాల ప్రాంగణం

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలోని పణుకువలస ప్రాథమిక పాఠశాల ప్రాంగణం చెరువును తలపిస్తుంది. దీంతో విద్యార్థులు ఉపాధ్యాయులు పాఠశాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గురువారం గ్రామంలో కురిసిన వర్షానికి పాఠశాల ప్రాంగణంలో నీరు చేరిపోవడంతో చెరువు లాగా మారి విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి ప్రాంగణం సమతుల్యంగా చేసి రహదారి వేయాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరారు. దీనిపై ప్రధానోపాధ్యాయులు నెల్లి సత్యంనాయుడును వివరణ కోరగా వర్షం పడితే నీరు చేరిపోతుందని తద్వారా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని సమాధానం చెప్పారు.

ప్రణాళికా బద్ధంగా పనులు చేపట్టాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

గ్రామాల్లో ప్రణాళిక బద్ధంగా ఉపాధి పనులు చేపట్టాలని జెడ్‌పిటిసి సభ్యులు జంపు కన్నతల్లి- ఉమామహేశ్వరరావు సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని కత్తులకవిటిలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. గ్రామంలోని 380జాబ్ కార్డులు ఉన్నాయని, 2025-26 ఆర్థిక సంవత్సరం సంబంధించి 46 పనులు రూ.కోటీ 60 లక్షలతో చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. పని కావాల్సిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని, తక్షణమే జాబు కార్డులు కూడా మంజూరు చేయాలని, గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి జి సరోజిని, ఎపిఒ జి.సత్యంనాయుడు, మాజీ ఎంపిటిసి ఆర్.రంగారావు, గ్రామ పెద్దలు రౌతు కృష్ణంనాయుడు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై గ్రామ సభలు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని గుచ్చిమి, అంటిపేట, కె.సీతారంపురం గ్రామాలలో 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా జరిగే పనులకు గురువారం గ్రామ సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఈసీ సోమేశ్వరరావు మాట్లాడుతూ గ్రామ సభలో ఆమోదమయ్యే పనులు మాత్రమే ఉపాధి హామీలో చేస్తామన్నారు. ముందుగా గ్రామసభలు నిర్వహించి ఆ గ్రామాలకు కావలసిన అన్ని రకాల పనులూ గ్రామస్తుల ద్వారా తీర్మానం చేసుకొని ఆమోదించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ లక్ష్మణరావు, ప్రసాదరావు, గ్రామ పెద్దలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వేతనదారులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు విరాజ్ దేవాంగ్ డిమాండ్ చేశారు. ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్రవ్యాప్త బస్సు జాతా గురువారం నాడు పార్వతీపురం చేరుకుంది. ఈ సందర్భంగా జరిగిన సభలో దేవాంగ్ మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పిపిపి పేరుతో ప్రైవేట్ , కార్పొరేట్ వ్యక్తులకు అప్పజెప్పే ఆలోచనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను ఉచితంగా అందజేస్తామని హామీ ఇచ్చిన నారా లోకేష్ నేడు పూర్తిగా ప్రైవేటీకరిస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల, ప్రభుత్వ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని, డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ చదువుకున్న విద్యార్థులకు పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్ అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వలరాజు, బందెల నాసర్ జీ, సహాయ కార్యదర్శులు కుల్లాయిస్వామి, మస్తాన్, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్మధరావు ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఆర్విఎస్ కుమార్ నాయకులు, ఇవి నాయుడు, దుర్గారావు ఎఐవైఎఫ్ నాయకులు కిరణ్, గోపి నాయుడు ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు పాల్గొన్నారు..

కొలిక్కిరాని డంపింగ్‌యార్డు సమస్య

◆ పరిష్కారానికి నేతల అడ్డంకి ◆ చెత్తాచెదారంతో అవస్థలు పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీలో ఎన్నో ఏళ్ల నుంచి ప్రధాన సమస్యగా ఉన్న డంపింగ్ యార్డ్ సమస్యను కొలిక్కి తెచ్చేందుకు ప్రస్తుత ఎమ్మెల్యే నిమ్మ జయకృష్ణతో పాటు కూటమిలో కొంతమంది నాయకులు ప్రత్యేక దృష్టి పెట్టారు. మేజర్ పంచాయతీకి నుంచి డంపింగ్‌యార్డు పాలకొండకు గుదిబండంగా తయారైంది. మొదట్లో ఓనికి వెళ్లే దారిలో చెత్త వేయగా అక్కడ స్థానికులు అడ్డుకున్నారు. ఆ తర్వాత తొడ్లలో చెత్తను వేస్తే అక్కడ కూడా స్థానికులు అడ్డగించారు. దీంతో ప్రభుత్వం అట్టల ప్రాంతంలో డంపింగ్ యార్డ్‌కు స్థలం కేటాయించగా స్థానికుల నుంచి వ్యతిరేకత రాగా, టిడిపి పారాపురంలో స్థలాన్ని సేకరించింది. అయితే అక్కడ కూడా స్థానికులు వ్యతిరేకించారు. దీంతో మల్లమ్మగూడ దగ్గర స్థలం సేకరించినప్పటికీ సమీప పంచాయతీలో ఉన్న సింగన్నవలస గ్రామస్తులు వ్యతిరేకించారు. దీంతో ఏం చేయాలో తెలియని పరిస్థితులలో ఓ- లుంబూరుకు వెళ్లే ప్రాంతంలో బత్తునువాని చెరువు దగ్గర తాత్కాలికి డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేశారు. దీన్ని అక్కడ రైతులు వ్యతిరేకిస్తున్నారు. దీంతో పాటు ఓని, జగన్ కాలనీవాసులు కూడా అడ్డుతగులుతున్నారు. అయితే ఎమ్మెల్యే చొరవ తీసుకొని విజయరాంపురం దగ్గర 8 ఎకరాల డి-పట్టా స్థలాన్ని గుర్తించారు. ఆ పట్టాదారుడికి స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నుంచి నిధులు కేటాయించి డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు సిద్ధమయ్యారు. దీంతో సిఎం తోపాటు మున్సిపల్ శాఖ మంత్రితో కూడా ఎమ్మెల్యేతో మాట్లాడి ఈ సమస్యకు కొలిక్కు తీసుకొచ్చారు. దీంతో పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఎట్టకేలకు పాలకొండ నగర పంచాయతీకి డంపింగ్ యార్డ్ సమస్య తీరుతుందని భావించారు.

పట్టణంలో పేరుకుపోయిన అపారిశుద్ధ్యం

అడ్డుకొనేందుకు పలువురు కుట్ర

డంపింగ్ యార్డు సమస్య తీరకుండానే, దీన్ని అడ్డుకొనేందుకు పట్టణంలోని కొంతమంది నేతలు తెరవెనుక నుంచి కుట్ర పన్నుతున్నట్లు తెలుస్తుంది. అటు వైసిపిలోనూ, ఇటు కూటమిలో కూడా కొంతమంది నేతలు పావులు కదుపుతున్నట్లు సమాచారం. మండలంలోని విజయరాంపురంలో 8 ఎకరాల డి-పట్టా వైసిపికి చెందిన వైస్ ఎంపిపికి చెందింది. అయితే ఆ వైసిపిలోనే నేతలు దీనికి అడ్డు తగులుతున్నట్లు తెలుస్తుంది. అదేవిధంగా డంపింగ్ యార్డ్ సమస్య ఎలాగైనా తీర్చాలని కంకణం కొట్టుకున్న ఎమ్మెల్యే, నగర పంచాయతీ సమన్వయకర్త పల్లా కొండలరావుకు కూడా వ్యతిరేకంగా ఉన్న కొంతమంది కూటమి నాయకులు పనిచేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతో అటు వైసిపి, ఇటు కూటమి నేతల్లో డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారమైతే తమకేమిటిని లోలోపల మదన పడుతున్నట్లు తెలుస్తుంది . దీంతో డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారమవుతుందా లేదా అని అందర్లో చర్చ జరుగుతుంది.

బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలి

ప్రజాశక్తి - సీతంపేట

ప్రభుత్వ పాఠశాలల్లోని శానిటేషన్ వర్కర్ల బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) మండలం సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ శానిటేషన్ వర్కర్ల కనీస వేతనాలు అమలు చేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పిఎఫ్, ఇఎస్ఐ వర్తింపజేయాలని అన్నారు. యూనిఫారం ఇవ్వాలని, సబ్బులు, నూనె, ఫినాయిల్ సరఫరా చేయాలని, ప్రతి నెలా 5లోపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, లేకుంటే ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అలాగే డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో సిఐటియు జాతీయ మహాసభలు జరగనున్నాయని, వీటిని

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు రమణారావు

జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎపి ప్రభుత్వ పాఠశాల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) మండలం అధ్యక్షులు పిరమాదేవి, ప్రధాన కార్యదర్శిగా ఎస్ సంతోషి, కె.ఉషారాణి, సావిత్రి పాల్గొన్నారు.

వంటశాల నిర్ణయం వెనక్కి తీసుకోవాలి

ఎపి మధ్యాహ్నం భోజనం పథకం కార్మికుల మండలం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సామూహిక వంటశాల విధానం తీసుకొచ్చి మండలానికి వంటశాల ఏర్పాటు చేయాలన్న ఆలోచన విరమించుకోవా లన్నారు.

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని, కనీస వేతనం అమలు చేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేయాలని, వంట శాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి నెలా 5లోగా వేతనాలు చెల్లించాలని, బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే విశాఖలో డిసెంబర్ 31 నుంచి జరగనున్న సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎపి మధ్యాహ్నం భోజనం పథకం కార్మిక యూనియన్ మండల నాయకులు చామంతి, జయసుధ, నయోమి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఖాళీ స్థలాలు గుర్తించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

పంచాయతీలకు సంబంధించిన ఖాళీ స్థలాలను గుర్తించి అందులో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని ఎంపిడిఒ బి.వెంకటరమణ సచివాలయాల కార్యదర్శులను ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డే డ్రై కార్యక్రమం నిర్వహించాలని, ప్రతి గురువారం గ్రీవెన్స్ తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. విధి నిర్వహణలో అశ్రద్ధ వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమయానికి సచివాలయాలకు చేరుకొని ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సమయానికి ఉద్యోగులు సచివాలయానికి రావట్లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, పనితీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ సిహెచ్ శంకర్రావు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

వట్టిగెడ్డ ద్వారా పూర్తిస్థాయిలో సాగునీరు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వట్టిగెడ్డ ఎడమ కాలువ ద్వారా పూర్తిస్థాయిలో సాగునీటిని సరఫరా చేస్తున్నట్లు ఇరిగేషన్ డిఇ డి.రవికుమార్ పేర్కొన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వట్టిగెడ్డ రిజర్వాయర్ ఎడమ ప్రధాన కాలువలో 4.21 కిలోమీటర్ల వద్ద గల పాత రక్షణ గోడ బలహీనంగా ఉండడం వల్ల నీటి వత్తిడికి పగిలి గండి ఏర్పడిందన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది వెంటనే గండిని గుర్తించి ఎడమ ప్రధాన కాలువలో నీటి ప్రవాహం అదుపు చేశారన్నారు. స్థానిక సాగునీటి సంఘ అధ్యక్షులు, ఆయకట్టు రైతుల సహాయంతో దిగువ ప్రాంతానికి సాగునీటికి అంతరాయం లేకుండా రక్షణ గోడ స్థానంలో ఇసుక బస్తాలతో తాత్కాలికంగా గండిని పూడ్చి మళ్లీ సాగునీటి సరఫరాను పునరిద్ధించినట్లు చెప్పారు. ప్రస్తుతం పూర్తిస్థాయిలో సాగునీటిని సరఫరా చేయడం జరుగుతుందని, అదేవిధంగా తాత్కాలిక, శాశ్వత మరమ్మతులకు తగు అంచనాలను తయారు చేసి పరిపాలనా ఆమోదానికి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

తాడేపల్లి ప్యాలెస్‌లోనే కల్తీ మద్యం ఫార్ములా

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

తమ అవినీతి, అక్రమాలు, పాపాలను ఎదుటి వారిపై నెట్టడంలో జగన్ అండ్ కో పిహెచ్‌డి చేశారని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి విమర్శించారు. గుమ్మలక్ష్మీపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. నకిలీ మద్యం విషయంలో ఏనుగుల మేతకు, చీమల మేతకు ముడి పెట్టాలని వైసిపి నాయకులు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. గత ఐదేళ్ల పాలనలో లిక్కర్ మాఫియా నడిపి రూ.3500 కోట్లు దోచుకున్న విషయాన్ని ప్రజల దృష్టి మళ్లించడానికి జగన్ కుట్రకు ప్లాన్ చేశారని, అందులో భాగంగానే చిత్తూరు జిల్లా ములకలచెరువు, ఇబ్రహీంపట్నం నకిలీ మద్యం అంశం అని అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టను దెబ్బతీయాలని

ప్రభుత్వ విప్ జగదీశ్వరి

ఉద్దేశంతోనే కుట్రపూరితంగా కల్తీ మద్యం ఫార్ములాను తాడేపల్లి ప్యాలెస్‌లో తయారు చేశారని ఆరోపించారు. సెప్టెంబర్ 29న ఆఫ్రికాకు వెళ్లేందుకు టికెట్ బుక్ చేసుకున్న జనార్దన్ రావును 23న జోగి రమేష్ ఇంటికి పిలిపించుకున్నారన్నారు. జనార్దన్‌రావు జోగి రమేష్ చిన్ననాటి స్నేహితులు కావడంతో నకిలీ మద్యానికి పక్కా ప్రణాళికలు రచించారని అన్నారు. గత ప్రభుత్వంలో మద్యం తయారీ కంపెనీలన్నింటినీ జగన్ గుప్పిట్లో పెట్టుకుని జెబ్రాండ్లు మాత్రమే తయారు చేశారని ఆరోపించారు. దీని ద్వారా రాష్ట్రంలో 30 వేల మంది ప్రాణాలు కోల్పోయారని జగదీశ్వరి అన్నారు.

ఆశ్రమ పాఠశాలలకు ఫ్యాన్లు వితరణ

ప్రజాశక్తి - కొమరాడ

ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు అవసరమైన ఫ్యాన్లను స్వచ్ఛంద సంస్థలు వితరణ చేయడం అభినందనీయమని ఒఎల్ రజిని అన్నారు. గురువారం పెదకేర్జల గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలకు విశ్వామిత్ర చారిటబుల్ ట్రస్ట్ 20 సీలింగ్ ఫ్యాన్లను వితరణ చేసింది. ఈ సందర్భంగా ఇటిడబ్ల్యూ రజిని చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఫ్యాన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు ఫ్యాన్ల వ్యతరణ చేయడంపై ఆ సంస్థను అభినందించారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులకు పెట్టే భోజనం నాణ్యమైన రుచికరమైన ఆహారాన్ని అందించి వారిని ఆరోగ్యంగా చూసుకునే బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ఇటీవల జరుగుతున్న సంఘటనను దృష్టిలో పెట్టుకొని ఎప్పటికప్పుడు విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించి అనారోగ్యం బారిన పడితే ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్సలు అందించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గణపతి, వార్డెన్ సీతారాం, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ ఇఒ ఘన ప్రసాద్, చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు డాక్టర్ జ్ఞాన ప్రసాద్, డాక్టర్ విశ్వమిత్ర, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు తప్పనిసరి

ప్రజాశక్తి - వీరఘట్టం

వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని స్థానిక ఎస్సై జి కళాధర్ వాహనదారులకు సూచించారు. గురువారం వీరఘట్టం ప్రధానరోడ్డులో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు అందుబాటులో ధ్రువ పత్రాలు ఉంచుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్

కురుపాం: వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ

ధరించుకొని వాహనం నడపాలన్నారు. ఈ సందర్భంగా పెండింగ్లో ఉన్న చలానా వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయనతో పాటు సిబ్బంది, వాహనదారులు ఉన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

కురుపాం : స్థానిక ప్రదీప్ నగర్ కాలనీ జంక్షన్ వద్ద ఎస్సై పి.నారాయణరావు గురువారం ముమ్మరంగా వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులకు అపరాదరుసుం వేసి, రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. అనంతరం మద్యపానం సేవించకుండా ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండి ద్విచక్ర వాహనం నడిపాలని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం: వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్ఐ

వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలి

సీతానగరం: వాహనదారులు తప్పక హెల్మెట్లు ధరించాలని ఎస్ఐ ఎం రాజేష్ అన్నారు. మండలంలోని చినబోగిలి జంక్షన్ వద్ద ప్రజలకు ఆయన గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలో భాగంగా ప్రతి ఒక్కరూ హెల్మెట్లు ధరించాలని 18 ఏళ్ల నిండిన యువకులు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ప్రభుత్వ నిబంధన మేరకు అన్ని పాటించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

బాలలకు వరం.. సత్వర చికిత్సా కేంద్రం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

బాలలకు ఆరోగ్యకరమైన భవిష్యత్ అందజేయడమే లక్ష్యంగా కృషి చేయాలని జిల్లా ఆర్‌బిఎస్‌కె అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు డిఇఐసి వైద్యులు, సిబ్బందికి సూచించారు. జిల్లా కేంద్రంలో గల బాలల సత్వర చికిత్సా కేంద్రాన్ని(డిఈఐసి) గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి ప్రతి రోజూ ఎంత

సిబ్బందికి సూచనలిస్తున్న జగన్‌మోహన్‌రావు

మంది బాలలకు వైద్య సేవలు అందిస్తున్నారు, గుర్తించిన వైకల్యాలు,ఎదుగుదల లోపాలు చికిత్సా, థెరపీ, ఉపకరణాల ద్వారా ఏమేరకు మెరుగు పడుతున్నాయి, అలాగే బాలల్లో పుట్టుకతో వ్యాధులు గుర్తించిన వారెవరైనా చికిత్స పొందుతున్నారా వివరాలపై ఆరా తీసి నివేదికలు పరిశీలించారు. ఇక్కడ చికిత్స, థెరపీల ద్వారా చాలా వరకు సమస్య నుండి మెరుగుపడేందుకు వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని, తద్వారా బాలల భవిష్యత్, జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. కార్యక్రమంలో డిఇఐసి పిల్లల వైద్య నిపుణులు డా ఎల్.భరత్‌చంద్ర, డెంటల్ వైద్యులు కె.సౌజన్య, థెరపిస్టులు వై.లక్ష్మీనారాయణ, కృష్ణవేణి, స్వాతి సిబ్బంది ఉన్నారు.

వైసిపి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - పాలకొండ

వైసిపి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాలు కార్యక్రమానికి పిలుపునివ్వడంతో గురువారం పట్టణ వైసిపి అధ్యక్షులు వెలమల మన్మథరావు ఆధ్వర్యంలో స్థానిక నగరపంయాయతీలో 11,12,13,18 వార్డుల పరిధిలో ప్రజలు, విద్యార్థులతో సంతకాలు చేయించారు. ఈ సందర్భంగా మన్మథరావు మాట్లాడుతూ వైసిపి ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీలు నిర్మిస్తే కూటమి ప్రభుత్వం 66 సంవత్సరాలు లీజుకు ఇచ్చి ప్రైవేటుపరం చేస్తే పేదప్రజలు, విద్యార్థుల భవిష్యత్ అంధకారం లో పడుతుందని అన్నారు. సంక్షేమ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధి లేదని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు దుప్పాడ పాపినాయుడు, కడగల వెంకటరమణ, కిల్లారి మోహన్, కోడెం బాబి, తూముల లక్ష్మణ, పల్లా భాను, భాసూరు కాంతారావు, నీలాపు శ్రీను, కో-ఆప్షన్ సభ్యులు కొండదాడి విజయకుమార్, దుంపల రమేష్, చిన్ని, టేకి రామకృష్ణ, గెద్ద చిన్నం నాయుడు, దాసరి నాగేశ్వరరావు, తుమ్మగుంట జగదీష్, జి.కృష్ణారావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కురుపాం: కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రయివేటు పరం చేయడాన్ని నిరసిస్తూ మండలంలోని నీలకంఠాపురం పంచాయతీలో వైసిపి మండల కన్వీనర్ ఐ.గౌరీ శంకర్రావు ఆధ్వర్యంలో గురువారం కోటి సంతకాలు సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎ. మన్మధరావు, వైస్ ఎంపిపి బి.అన్నాజిరావు, ఎంపిటిసి బి.రాజేశ్వరి, నాయకులు ఐ. రామకృష్ణ, ఎన్. వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ ముందే అధ్వానం

ప్రజాశక్తి పాలకొండ

అసలే వర్షాలు కురు స్తున్నాయి... జ్వరాలు విజృంభి స్తున్నాయి. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచు కోవాల్సి ఉన్నప్పటికీ సంక్షేమ గృహాల్లో పారిశుధ్యం అధ్వా నంగా కనిపిస్తుంది.

హాస్టల్ ముందు దర్శనమిస్తున్న చెత్త పోగు

పట్టణంలోని ఇందిరా నగర్ కాలనీలో ఎస్టీ బాలురు వసతి గృహంలో పారిశుధ్యం అధ్వానంగానే ఉంది. సంక్షేమ వసతి గృహం చుట్టుపక్కల డంపింగ్ యార్డ్‌ను తలపించేలా చెత్త దర్శనమిస్తుంది. దీంతో పలువురు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చల్లమనాయుడు వలసలో గురువారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ వి.పారమ్మ మాట్లాడుతూ గ్రామంలో అంటు వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు మందస్తు చర్యల్లో భాగంగా పారిశుధ్య పనులను చేపడుతున్నామన్నారు. అనంతరం రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలను తొలగించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు జోష్ణ, మాజీ సర్పంచ్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పవన్ దృష్టికి సమస్యలు

ప్రజాశక్తి -పాలకొండ

నియోజకవర్గంలోని పలు సమస్యలను ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తీసుకెళ్లారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని, పలు గ్రామాల్లో రహదారులు సౌకర్యాలు కల్పించాలని కోరారు. పాలకొండ-వీరఘట్టం ప్రాంతాల్లో రైతు బజార్లు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారు.

సుఖ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో గల కేటీఆర్ ఒకేషనల్ కళాశాల వద్ద గురువారం వైడిఒ నెట్వర్క్ మేనేజర్ ఎల్.శ్రీకాంత్ బాబు హెచ్ఐవి ఎయిడ్స్, సుఖ వ్యాధులు బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవి వ్యాధి ఎలా వ్యాప్తి చెందుతుంది, వ్యాధి రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు నివారణ మార్గాలు, వ్యాధి సోకిన తర్వాత పాటించవలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైడిఒ నెట్వర్క్ ఔట్రీచ్ వర్కర్ ఏ గీతారాణి, ఏఎన్ఎం లక్ష్మి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల సమీపంలో అపారిశుధ్యం

ప్రజాశక్తి -వీరఘట్టం

పాఠశాల పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రమైన వాతావరణం నెలకొల్పాలని కలెక్టర్‌తో పాటు ఉన్నత స్థాయి అధికారులు పదేపదే ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ ఇక్కడ అధికారుల నిర్లక్ష్యం వల్ల పాఠశాల పరిసర ప్రాంతాల్లో అపారిశుధ్యం దర్శనమిస్తోంది. మండలంలోని నడుకూరు గ్రామ పాఠశాల సమీపంలో ఉన్న చెత్తను తొలగించకపోవడంతో చెత్త పేరుకుపోవడం వల్ల దుర్వాసన వెదజల్లుతుంది. పాఠశాల ప్రధాన రహదారికి ఆనుకొని ఉండడం వల్ల పాఠశాల సమీపంలో చెత్త వేయడంతో నిత్యం వందలాదిమంది రాకపోకలు సాగిస్తున్నారు. ఈ ప్రభావం విద్యార్థులపై పడే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహానికి ఆనుకొని పిచ్చి మొక్కలు

పాఠశాల ప్రహరీని ఆనుకుని ఉన్న చెత్త

పెరిగిపోవడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో విద్యార్థులు రోగాలు బారిన పడే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు రోగాల బారిన పడకముందే ఆయా చోట్ల పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

గిరిజనులకు మినీ ట్రాక్టర్లు పంపిణీ

ప్రజాశక్తి- సీతంపేట

సీతంపేట ఐటిడిఎ పరిధిలో ఉన్న గిరిజనులకు హార్టికల్చర్ మిడ్ 2019-20 పథకం ద్వారా 50శాతం సబ్సిడీపై గురువారం ఐటిడిఎ ఆవరణంలో 5 గురు గిరిజన రైతులకు మినీ ట్రాక్టర్స్‌ను పంపిణీ చేశారు. సీతంపేట, భామిని, బూర్జ, సారవకోట రైతులకు ప్రాజెక్ట్ అధికారి పవార్ స్వప్నిల్ జగన్నాథ్ చేతులు మీదుగా అందించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ మినీ ట్రాక్టర్ ఇవ్వడం వల్ల రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ఒ వెంకట గణేష్, డిడి అన్నదొర, డిప్యూటీ ఇఒ రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ తాళం అందిస్తున్న పిఒ